# మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ ఎంగెల్స్‌కు జోహార్లు

## 2020 నవంబరు 28 కామ్రేడ్ ఎంగెల్స్ ద్విశత జయంతి



(మార్క్సిస్టు సిద్ధాంతకర్తలైన కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు రెండు సంవత్సరాల తేడాతో జర్మనీలో జన్మించారు. మార్క్స్ 1818, ఎంగెల్స్ 1820లోజన్మించారు. అందువలన రెండేళ్ళ తేడాతో 2018లో మార్క్స్, 2020లో ఎంగెల్స్‌ల రెండు వందల జయంతి ఉత్సవాలు భారత్‌తోపాటు ప్రపంచమంతటా జరుగుతున్న విషయం తెలిసిందే! ఎంగెల్స్‌కు సంబంధించి కొన్ని ముఖ్యమైన విషయాలు జనశక్తి పాఠకులకు క్రింది వ్యాసంలో ప్రస్తావించుకోవటం ఎంతైనా ఆవశ్యకం! - సం॥)

**ఎంగెల్స్** చదువు పూర్తిచేయకుండానే సెకండరీ విద్యను మధ్యలోనే విరమించవలసి వచ్చింది. కారణం - తన తండ్రి ఒక ఖార్ఖానాదారుడు. తండ్రి అభీష్టంమేరకు, వ్యాపార వ్యవహారాలకు ఉన్నత చదువక్కరలేదని భావించడంవల్లనే అలా చేశాడు. తండ్రికి జర్మనీలోనేకాదు, బ్రిటన్-మాంచెస్టర్ నగరంలో ఒక జౌళిమిల్లు వుంది. దాని నిర్వాహక బాధ్యతలను ఎంగెల్స్ చేపట్టాడు. ఇది 1842లో జరిగింది. నాటికి ఇంగ్లండు పారిశ్రామిక కేంద్రంగా ప్రసిద్ధిగాంచింది. అదే సమయంలో కార్మికరంగం కూడ అంతకంటే ఎక్కువశాతం అభివృద్ధిచెందినది.

ఇక మాంచెస్టరు నగరం బట్టల మిల్లులతో రాణిస్తోంది. అక్కడ కార్మికులసంఖ్య గణనీయంగా పెరిగింది. తయారైన బట్టల ఎగుమతి కేంద్రం గాను, పత్తి దిగుమతి కేంద్రంగా విరాజిల్లింది.

అప్పటికే ఎంగెల్స్ ప్రగతిశీల భావాలు, హేతువాదదృష్టి, హెగెలియన్ తాత్విక భావాలు కలిగివుండటం, ఆర్ధిక రాజకీయ సాంఘిక సమస్యలను పరిశీలించే స్థాయికి ఎదిగాడు. అందువలన ఎంగెల్స్ ప్రత్యక్ష కార్యాచరణలో ఎదువుతున్న సమస్యలను నిశితంగా పరిశీలించాడు. ప్రత్యేకంగా కార్మికులు, శ్రామికులు, మహిళలు, బాలకార్మికులు నివసించే కార్మికవాడలను అటు మాంచెస్టరు లోను, ఇటు ఇంగ్లాండ్ తదితర పారిశ్రామిక కేంద్రాల్లోను వారిని కలుసుకుని సమగ్రంగా సర్వేచేసి, "ఇంగ్లాండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు" అనే గ్రంథాన్ని జర్మన్ భాషలో రాసి 1845లో ప్రచురించాడు. కార్మికవర్గ సమస్యలకు అద్దం పట్టిన ఆ గ్రంథం యూరోపియన్, తదితర బాషల్లోను ప్రచురితమైంది. తెలుగు భాషలో 2010లో ప్రగతి ప్రచురణలు, హైదరాబాద్ వారు ప్రచురించారు.

1840 ప్రధమార్థంలో మార్క్స్, ఎంగెల్స్ పరస్పరం పరిచయం ఏర్పడింది. కాని ఇద్దరు అప్పటికే పత్రికలలో వ్యాసాలు రాయడం, సంపాదకవర్గ సభ్యులుగా వ్యవహరించడం, వారి రచనలను పరస్పరం అధ్యయనంచేయడం వలన పరోక్ష సంబంధాలలోకి వెళ్ళారు. మార్క్స్ వ్యాసాలు తత్వశాస్త్ర, చరిత్ర అంశాలపై సాగితే, ఎంగెల్స్ కార్మిక ఆర్ధిక విషయాలపై రాసేవాడు. "రాజకీయ అర్ధశాస్త్ర విమర్శ ఓ రేఖాచిరతం" అన్న శీర్షికతో ఎంగెల్స్ రాయటం జరిగింది. 1842లో ఒకసారి, 1844లో మరోసారి ఎంగెల్స్ పారిస్ వెళ్ళి మార్క్స్‌ను కలిశాడు. రెండోసారి మార్క్స్‌ని కలిసినపుడు, ఎంగెల్స్ అక్కడే 10 రోజులు మకాంవేసి అన్ని అంశాలపై సాంగోపాగంగా చర్చించారు. ఆ భేటి వారిద్దరి భావనలను, తాత్విక సైద్ధాంతిక, ఆర్ధిక అంశాలపై ఏకీభావంతో వ్యవహరించడంలో పునాది ఏర్పడింది.

ఆనాటికే ఇంగ్లండులో ట్రేడ్ యూనియన్లు ఏర్పాటుకావడం, తమ సమస్యల సాధనకు ఆటంకం కల్పిస్తున్న ట్రేడ్ యూనియన్లపై కొనసాగుతన్న నిషేధాజ్ఞలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్న విషయం పోకస్ అయింది. మరోవైపు పాలకవర్గాలు కూడ సంఘాల నిషేధం ఉత్పత్తికి పరిమితులు ఎదురవుతున్నాయని గ్రహించడంతో 1824 నుండి దానిని తొలగించారు. అప్పటినుండి ట్రేడ్‌యూనియన్లు ఏర్పాటు క్రమక్రమంగా విస్తృతంగా సాగాయి. ఆనాడు చార్టిస్టుల నాయకత్వంలో పనిగంటలు తగ్గించాలని, ఓటుహక్కు తమకూ కల్పించాలని విజ్ఞాపనల రూపంలో ఉద్యమాలు సాగాయి. పార్లమెంట్‌కు లక్షల సంతకాలతో కూడిన మహావిజ్ఞాపన పత్రం సమర్పించారు. దీనినే "చార్టర్"గా (కోర్కెలపత్రం) పేర్కొన్నారు. అదే చార్టిస్టు ఉద్యమంగా, చార్టిస్టులుగా కార్మికులకు చిరపరిచితమైంది. ఈ సంస్థ ఉద్యమ ప్రభావం దేశమంతటా చూపించింది. అయితే ఆ సంస్థ కార్మికవర్గ రాజకీయాలుగాని, సోషలిస్టు రాజకీయాలుగాని స్వీకరించలేదన్నది వాస్తవం.

### కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

1842 నాటికి మార్క్స్ పి.హెచ్‌డి పొందక పూర్వం విద్యార్ధి దశలో వుండగానే తత్వశాస్త్రం, చరిత్ర, విజ్ఞానశాస్త్రాలు అధ్యయనం చేశాడు. అంతేగాక విశ్వవిద్యాలయ ఆచార్యులు హెగెల్ రచనలు, మరో ఆచార్యులు, భౌతికవాది అయిన లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ రచనలు కూడా అధ్యయనంగావించాడు. 'రేనిష్ జీటంగ్' అనే

పత్రికకు 1842లో మార్క్స్ సంపాదకుడయ్యాడు. ఈ పత్రికను 1844లో ప్రష్యా ప్రభుత్వం మూసివేయడంవలన మార్క్స్ పారిస్‌కు ప్రవాసిగా వెళ్ళటం జరిగింది. అక్కడే మార్క్స్, ఎంగెల్స్‌లు కల్సుకుని విప్లవ మేధావులుగా ముందుకు సాగిన విషయాన్ని పైన ప్రస్తావించుకున్నాం.

1845లో పారిస్‌లో వుంటున్న మార్క్స్ విప్లవ కార్యకలాపాలు సాగించరాదని ఫ్రాన్స్ ప్రభుత్వం మార్క్స్‌ను ఆ దేశం నుండి బహిష్కరించింది. తన కార్యక్రమాలకు బ్రస్సెల్స్ అనువుగా వుంటుందని భావించిన మార్క్స్ అక్కడకు ప్రవాసిగా వెళ్ళాడు. ఆనాటికి విప్లవ సంస్థలు కొన్ని పనిచేస్తున్నాయి. వీటిలో మార్క్స్, ఎంగెల్స్‌లకు సభ్యత్వం వున్నది, పనిచేస్తున్నారు. వీరిద్దరూ కలిసి 'కమ్యూనిస్టు కమిటీస్ ఆఫ్ కరస్పాండెన్స్' అనే సంస్థను నిర్మించుటకు 1946 ఫిబ్రవరిలో పూనుకున్నారు. యూరప్ దేశాల విప్లవ కార్యకర్తలుతో సంబంధాలు పెంచుకొని ప్రచార కార్యక్రమాన్ని సాగించారు. 1839లో ఫ్రాన్స్‌లో 'బ్లాంకిస్టు' గ్రూప్ తీసుకువచ్చిన తిరుగుబాటు వైఫల్యం చెందాక 'ఫెడరేషన్ ఆఫ్ ది జస్ట్' అన్న సంస్థలు కొన్ని దేశాలలో ఏర్పడి పనిచేస్తున్నాయి. వీటితోను సంప్రదింపులు సాగించారు. ఈవిధంగా ఏర్పడిన సంస్థలు అన్నింటిని సమన్వయపరచుటకు మార్క్స్, ఎంగెల్స్‌లు కృషిచేశారు. దాని ఫలితంగా 'కమ్యూనిస్టు లీగ్' అనే సంస్థ 1847లో ఆవిర్భవించింది. 1847 డిశంబరులో కమ్యూనిస్టు లీగ్ రెండవ మహాసభ లండన్‌లో జరిగింది.

ఆ మహాసభలో మార్క్స్, ఎంగెల్స్‌తోపాటు ఇతర దేశాల కార్మికసంఘాల ప్రతినిధులు పలువురు నాయకులు పాల్గొన్నారు. అందులో నిబంధనావళిని రూపొందించి, చర్చించి ఆమోదించారు. కార్యక్రమ పత్రాన్ని రూపొందించే బాధ్యతను మార్క్స్, ఏంగెల్స్‌లకు (రెండు నెలల్లో తయారుచేయడం) అప్పగించారు. ఈ మేరకు కమ్యూనిస్టు ప్రణాళికను తయారుచేశారు. 1848 ఫిబ్రవరిలో లండన్‌లో ప్రచురించారు. అది మానవసమాజ చరిత్రలో అమూల్యమైనదిగా నిలిచింది. ప్రపంచ కార్మికులకు అదొక ప్రథమ విప్లవ కార్యక్రమ పత్రం. 1914లో లెనిన్ ప్రణాళిక విశిష్టతను లెనిన్ క్రిందివిధంగా వ్యాఖ్యానించాడు.

"ఈ గ్రంథం ప్రపంచాన్ని ఎంతో స్పష్టం గానూ, ప్రతిభావంతంగానూ ఒక నూతన దృక్పథంతో పరిశీలించింది. మానవుని జీవిత రంగాలన్నింటినీ సామాజిక జీవితంతో సహా భౌతికవాద దృష్ట్యా పర్యావలోకించింది. గతితార్కికవాదమే సమగ్రమైన, ప్రగాఢమైన పరిణామ సిద్ధాంతమని స్పష్టంచేసింది. వర్గ పోరాటాన్ని గూర్చి, నూతన కమ్యూనిస్టు సమాజానికి సృష్టికర్త, అయిన కార్మికవర్గం నిర్వహించాల్సిన చారిత్రక విప్లవ పాత్రను గురించి విశదీకరించింది" - లెనిన్.

(ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం దాని పరిణామం, పేజి.17, చంద్ర పుల్లారెడ్డి, మానికొండ సుబ్బారావు, ప్రచురణ-ప్రజాశక్తి బుక్‌హౌస్, విజయవాడ)

అదే ప్రణాళికను గురించి 1917లో మరోసారి లెనిన్ ఉదహరించుతూ "మార్క్స్, ఎంగెల్స్‌లు తాము కమ్యూనిస్టులమని ఉదహరించుకున్నారు. అలాగే మనం మార్క్సిస్టులమని చెప్పుకోవాలి. కమ్యూనిస్టు మానిఫెస్టోను మనం పునాదిగా తీసుకోవాలి. ఆవిధంగా సోషల్ డెమోక్రసియొక్క విద్రోహంనుండి బయటపడాలి" - లెనిన్ (అదే పుస్తకం పేజి.17)

## మొదటి ఇంటర్నేషనల్ ఏర్పాటు

కమ్యూనిస్టు ప్రణాళిక ఆవిర్భావంతో కార్మికులకు అదొక విప్లవ కార్యాచరణ పత్రంగా పనిచేసింది. యూరప్‌లో 1848-50ల మధ్య విప్లవాల వెల్లువ వచ్చింది. అవి, ఓటమి పాలైనా ఫ్యూడల్‌శక్తుల పాలనా మరింత బలహీనపడగా పెట్టుబడిదారీ విధానం బలం పుంజుకుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ ఏర్పాటు ఆవశ్యకతను కార్మికసంఘాలు గుర్తించి, నిర్మాణంకోసం ప్రయత్నాలు సాగించాయి. ఆ ప్రయత్నాలు ముందుకుసాగి 1864లో ఒక కొలిక్కి వచ్చాయి. సాధారణంగా పెట్టుబడి దాని విధానంలో ఆర్థికపోరాటాలు సాగుతుంటాయి. అంటే ఎక్కువ వేతనాలకోసం, పనిగంటలు తగ్గింపు కోసం ఆందోళనలు, సమ్మెలు చేస్తుంటాయి. ఇవి, కార్మికవర్గ ఉమ్మడి సమస్యల పరిష్కారానికి దోహదపడినా మౌలిక ప్రయోజనాలను తీర్చలేవు. ఎందుకంటె బూర్జువావర్గాలను వారి సమస్యలను పరిష్కరించే బూర్జువా పార్టీలుంటే, కార్మికులకు సారధ్యం వహించగల కమ్యూనిస్టు పార్టీలను యింకా నిర్మించుకోలేదు. అందువలన కమ్యూనిస్టు పార్టీల ఏర్పాటు చేసుకోవటం, బూర్జువా పార్టీల అధికారాన్ని స్వాధీనపరచుకుంటేనే శ్రామికుల మౌలిక సమస్యల పరిష్కారం సాధ్యమవుతుంది. అందుకే మొదటి ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ కార్మికసంస్థ) సమావేశాన్ని 1864 సెప్టెంబరు 28న లండన్‌లో కార్మికసంఘాలు, వాటిల్లో ముఖ్యంగా ఇంగ్లాండు కార్మిక సంఘాలు, వాటి నాయకులు ముఖ్యపాత్ర వహించాయి. కాని ఆ సమావేశం చేసిన తీర్మానాలు, పత్రికల్లో రాజకీయ ముఖ్యసమస్యలపై వివరిస్తూ వ్రాసిన వ్యాసాల విషయంలో మార్క్స్ మార్గనిర్దేశం చేశాడు. "ఆధునిక చరిత్ర" అన్న గ్రంథం 6 గురు రష్యన్ రచయితల బృందం 1860 దశకం ప్రారంభంలో వెలువరించారు. అందులో మార్క్స్. ఆయన అనుయాయులు మొదటి ఇంటర్నేషనల్‌లో నిర్వహించిన పాత్రను ప్రస్తావించారు. దానిని క్రింద యిస్తున్నాం.

"మొదటి ఇంటర్నేషనల్ దైనందిన కార్యకలాపాలకు దర్శకత్వం వహించే పని ఆయన చేసేవాడు. కార్మికజనంలో తప్పు అవగాహనలు కొన్ని వుంటాయి. కార్మికవర్గ విప్లవం విజయవంతమవుతుందని నమ్మని వాళ్ళు, రాజకీయ పోరాటాన్ని తిరస్కరించి, కేవలం ఆర్థిక పోరాటానికి పరిమితం కావాలనుకున్నవారు. అటువంటి వాళ్ళతో మార్క్స్, ఆయన అనుయాయులూ, మొదటి ఇంటర్నేషనల్‌లో, ఆంతరంగిక పోరాటం సాగించినారు. సిద్ధాంతరీత్యా విప్లవం సంభవమని ఒప్పుకుంటూ, అది దానంతట అదే యాంత్రికంగా వస్తుందనే నమ్మకంతో దాని విజయం కొరకు ఏమీ చేయని మరో రకంవాళ్ళతో కూడా మార్క్స్, ఎంగెల్సూ పోరాటం సాగించినారు. ఆ రెండు బృందాలవాళ్ళూ కార్మికుల్లో బూర్జువా పలుకుబడి

పెరగడానికి అవకాశం పలుకుబడి పెరగడానికి అవకాశం కల్పించినారు".

ఆధునిక చరిత్ర, పేజి:251(ప్రగతి ప్రచురణలు, హైదరాబాద్)

1864లో ఏర్పాటైన మొదటి ఇంటర్నేషనల్ 1872 వరకు నడిచింది. ఈ 8 సంవత్సరాలలో 5 మహాసభలు, ఒకటి సన్నాహక సమావేశం, రెండు ప్రతినిధుల సమావేశాలు జరిగాయి. 1872లో ఇంటర్నేషనల్ కార్యాలయాన్ని లండన్ నుండి అమెరికాకు మార్చబడింది. చివరకు 1876లో ఆ సంస్థను అమెరికన్ కార్మికసంస్థ రద్దుచేసింది. కాని ఆ సంస్థ యూరోపియన్ దేశాలకు విస్తరించడమే కాదు, వాటిలో కార్మికుల ప్రయోజనాలకోసం, హక్కుల కోసం పోరాటాలు సాగించి, కార్మికవర్గంకోసం కమ్యూనిస్టు పార్టీలను నిర్మించి, చారిత్రక పాత్రను నిర్వహించి, దాని లక్ష్యాలు – ఆశయాలుకోసం ఆచరణాత్మకమైన చేసిన కృషి స్ఫూర్తిదాయకం!

ఇంటర్నేషనల్ కాలంలో పారిస్ కమ్యూన్ అవతరించింది. 1871 మార్చి 18న పారిస్ కార్మికవర్గ శక్తులు, ప్రజాతంత్రశక్తులు తిరుగుబాటు చేసి పారిస్‌ను నిలబెట్టుకున్నాయి. 72 రోజులు మాత్రం కమ్యూన్ పాలన సాగించింది. దీనికి మార్క్స్ – ఎంగెల్స్, కమ్యూనిస్టులు పూర్తి మద్దతు సహకారం అందించారు. కమ్యూన్ పాలన కొద్దికాలమే అయినా కార్మికవర్గ, ప్రజానుకూల శాసనాలను చేయగల్గింది. కమ్యూన్ ఆంతరంగిక విభేదాలు, బాహ్యావిద్రోహశక్తుల కూటమి సాగించిన విద్రోహకర చర్యల వలన పారిస్‌కమ్యూన్ నిలద్రొక్కుకోలేక పతనమైంది.

అనంతరం మార్క్స్ యిలా అన్నాడు: "అది ప్రధాన కార్మికవర్గ ప్రభుత్వం. దోపిడీ వర్గానికి వ్యతిరేకంగా ఉత్పత్తిదారులు సాగించిన పోరాటం నుండి ఉద్భవించింది. కార్మికుల ఆర్థికవిముక్తిని సాధించడానికి రాజకీయ రూపం కనిపెట్టబడింది. మార్చి 18న పారిస్‌లో కార్మికవర్గ విప్లవం తిరుగులేని అధికారాన్ని చలాయించింది". సోషల్ డెమోక్రటిక్ ఫిలిస్టెయిన్ లను (సోషలిజాన్ని వల్లిన్నానే వర్గపోరాటం అంటే గజగజవణికిపోయే బాపతు) ఉద్దేశించి ఎంగెల్స్ "మహాశయులారా కార్మికవర్గ నియంతృత్వ మంటే ఎలా వుంటుందో మీరు చూడదలచారా? అయితే చూడండి. అదే కార్మిక నియంతృత్వం పారిస్‌కమ్యూన్ వైపు చూడండి. అదే కార్మికవర్గ నియంతృత్వం" అని అన్నాడు. పారిస్‌కమ్యూన్ కూలిపోయినప్పటికీ, అది మొట్టమొదటిసారిగా ప్రపంచంలో కార్మికవర్గం సాధించిన విజయం. పెట్టుబడిదారీ వ్యవస్థను తొలిసారిగా గట్టిదెబ్బ తీసిన విప్లవ ఘటన అది. అర్థశతాబ్దం అనంతరం రష్యన్ విప్లవానికి మార్గదర్శకమైంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు గండికొట్టిన రష్యన్ విప్లవం పారిస్‌కమ్యూన్ పాఠాలు తీసుకుంది. "ఎన్ని తప్పిదాలు జరిగినా పారిస్‌కమ్యూన్ 19వ శతాబ్దంలో కార్మికవర్గం నిర్మించుకున్న ఉజ్వల చారిత్రక విప్లవజ్యోతి అది" లెనిన్. (ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం దాని పరిణామం. పేజి:90)

## మార్క్స్ పెట్టుబడి గ్రంథం వెలువరించటంలోఎంగెల్స్ కృషి-సహకారం

మార్క్స్ దాదాపు 5 సంవత్సరాలపాటు వివిధ దేశాలలో ప్రవాసం గడిపి ఎక్కడా స్థిరనివాసం లభించలేదు. చివరకు 1849లో ఇంగ్లండ్‌లో అడుగుపెట్టిన మార్క్స్ 1883లో కన్నుమూసేవరకు అక్కడే జీవితం గడిపాడు. అక్కడకు చేరాక రాజకీయ అర్థశాస్త్రం రచనకు పూనుకున్నాడు. విద్యార్థి దశ ముగిసేనాటికి మార్క్స్ తత్వశాస్త్ర, రాజకీయ, చరిత్ర, ఆర్థిక గ్రంథాలను అధ్యయనం చేసి, నోట్స్ రాసుకున్నాడు. అదేవిధంగా మార్క్స్ లండన్‌లో వున్న బ్రిటీష్ మ్యూజియం రీడింగ్‌రూంకు వెళ్ళి అక్కడ తన కిష్టమైన రంగాలకు చెందిన గ్రంథాలను అధ్యయనం ప్రారంభించాడు. అక్కడకు ఉదయం గం.9 లకు వెళితే రాత్రి 7 గంటల వరకు గడిపేవారు. తను అధ్యయనం చేసిన గ్రంథాలలోని తనకవసరమైన అంశాలపై నోట్స్ తీసుకునేవారు. ఒకవైపు కుటుంబ యిబ్బందులు, అప్పటికి ముగ్గురు పిల్లలు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు, తీవ్రంగా ఎదుర్కొంటున్న మార్క్స్‌కు ఎంగెల్స్ ఆర్థికంగా ఆర్థిక సహాయం అందించేవాడు. అంతేగాక దాదాపు ప్రతిరోజు వారి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతుండేవి. వాటిల్లో ఆర్థిక, రాజకీయ, తాత్త్విక విషయాలు వగైరా ప్రస్తావించుకొని విశదపరచుకొనేవారు.

అయితే ప్రారంభించిన పెట్టుబడి గ్రంథం రచనా పనిమాత్రం ముందుకు సాగలేదు. ప్రారంభిస్తాను, పూర్తిచేస్తానని తన మిత్రుడు ఎంగెల్స్‌కు తెలియచేస్తూనే వుంటాడు. 1857లో అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభం తలెత్తింది. మరల అధ్యయనం చేయాలని సంకల్పించాడు. అమెరికాలో ప్రారంభమైన ఆ సంక్షోభం యూరప్‌కు ఎగబాకింది. ధరలు పడి పోతున్నాయి. మార్కెట్లు పతనం కావడంతో కంపెనీలు దివాళా తీస్తున్నాయి. పై అంశాలను సాకల్యంగా అధ్యయనం చేసిన మార్క్స్, 'రాజకీయ అర్థశాస్త్రం విమర్శ' రాసి 1859లో వెలువరించాడు. 1867 ఏప్రిల్ నాటికి పెట్టుబడి మొదటి భాగాన్ని పూర్తిచేసి ప్రచురణకు సిద్ధం చేశాడు. ఆయన రచనలు తన మాతృభాష జర్మన్‌లో రాశాడు. ముందుగా ఆ భాషలో మొదటిభాగం వెలువడింది. తర్వాత ఫ్రెంచ్, రష్యన్, ఆంగ్ల భాషల్లో పెట్టుబడి మొదటిభాగం వెలువడింది. అయితే ఆర్థిక విషయాలు పాఠకులు అవగాహన చేసుకోవటం కష్టమైన విషయం! అందులో భాష అంత తేలిగ్గా లేదు. శైలి అదే స్థాయిలో వుంది. భాషను సరళీకరించాలని పాఠకులు తమ అభిప్రాయాలను విస్తృతంగానే వ్యక్తీకరించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న మార్క్స్, ఎంగెల్స్ కొంతమేరకు ప్రయత్నాలు చేశారు.

'రాజకీయ అర్థశాస్త్రం విమర్శ, పెట్టుబడి' అన్న గ్రంథాలను అధ్యయనానికి దోహద పడేందుకు ఎంగెల్స్ రాసిన సమీక్షా వ్యాసాలు కార్మిక వర్గాలకు,శ్రామికులకు ప్రయోజనకారిగా వున్నాయి. 'లీప్‌జిగ్' డెమోక్రటిక్ వీక్లీ'కి 'లండన్ పోర్ట్‌నైట్లీ రివ్యూ'కి రాశాడు. వాటిల్లో మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతాన్ని వివరించుతూ రాశాడు. ఆవిధంగా పెట్టుబడి గ్రంథం

బూర్జువా ఆర్థిక వ్యవస్థ మూల సమస్యలను ప్రత్యామ్నాయాలను ముందుకు తీసుకు వచ్చాడు. ఎంగెల్స్ గృహసమస్య పరిష్కారానికై అర్థవంతమైన ప్రతిపాదనలను బూర్జువా పాలకుల దృష్టికి తీసుకువెళ్ళి, పరిష్కారంకొరకు ఒక గ్రంథాన్ని రాశాడు.

ఇక రెండవ, మూడవ, నాల్గవ పెట్టుబడి గ్రంథాల భాగాల ప్రచురణకు రాత ప్రతులను మార్క్సు సమగ్రంగా సిద్ధం చేయలేకపోయాడు. వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు, కుటుంబ ఆర్థిక సమస్యలు, వారి సతీమణి 1881లో మరణించటం వంటి సమస్యలు కూడా ఆటంకాలు కల్పించడంతో ఆ మూడు భాగాలు సిద్ధంచేయలేకపోయారు. చివరకు ఆ పనిభారం ఎంగెల్స్‌పై బడింది. వారి నాయకత్వం వహించి వరుస క్రమంలో వెలువరించడానికి పూను కున్నాడు. మార్క్సు తన మరణానికి కొంచెం ముందు తన కూతురు ఎలినార్‌తో, యీ రాతప్రతికి ఎంగెల్స్ ఒక రూపం యివ్వాలని చెప్పాడు. ఈ పనికి తన వయస్సు అప్పటికి 62కి చేరింది. మార్క్సు మరణానంతరం ఎంగెల్స్‌కు సుస్తీచేసి, మంచంమీద కదలలేని స్థితి ఎదురైంది. అయినా రాతప్రతిని చూచి, ఫైనల్ ప్రతికి, ఒక సహాయకుడ్ని ఏర్పాటుచేసుకొని రాతప్రతులను పరిశీలిస్తూ తానుగా అతనికి డిక్టేట్‌చేసి రాయించాడు. ఉదయం 10 గం.లకు ఆ పని ప్రారంభిస్తే సాయంత్రం గం.5ల వరకు సాగించారు. ఈ పనిసాగించేటప్పుడు ఎంగెల్స్ ఒకవ్యాఖ్య చేశాడు:

"రాత ప్రతికి శుద్ధ ప్రతి తయారు చెయ్యడమన్నది మొత్తం పనిలో ఒక భాగం మాత్రమే. అయితే, అదే అన్నిటికన్నా ముఖ్యమైన పనికాదు. జరగాల్సిన సృజనాత్మకమైన పని బోలెడంత వుంది. ఎంగెల్స్ మినహా మరెవరూ చేయగల్గిన పనికాదది. రాతప్రతిలో సమగ్రంగా కొన్నిభాగాలకు తోడు, మరికొన్ని ముఖ్యమైన భాగాలే సంక్షిప్తంగా రాయబడి వున్నాయి. కొన్ని కొన్ని భాగాలకు వేర్వేరు పాఠాలున్నాయి. రాతప్రతిని ఎంగెల్స్ అతి జాగ్రత్తగా చూడాల్సి వచ్చింది. కొన్ని భాగాలను కత్తిరించి, మరి కొన్నిచోట్ల కొన్ని కొన్ని అంశాలను జేర్చవలసి వచ్చింది. కాపిటల్ రెండవ భాగానికి తాను రాసిన ముందుమాటలో, తానీ పనులను "పూర్తిగా రచయిత భావాలకు అనుగుణంగా చేసేందుకు శాయశక్తులా కృషిచేశానని ఎంగెల్స్ పేర్కొన్నాడు". (ఫ్రెడరిక్ ఎంగెల్స్ సంక్షిప్త జీవిత చరిత్ర పేజి.149, రచయిత సెపనోవా, విశాలాంధ్ర బుక్‌హౌస్, విజయవాడ) ఈ విధంగా పెట్టుబడి గ్రంథం 2వ భాగాన్ని ఎంగెల్స్ సంపాదకత్వాన పూర్తిచేసి, 1885లో ప్రచురణకు పంపారు. పైవిధంగానే మూడవ భాగాన్ని, తాను డిక్టేట్‌చేసి, రాయించారు. దీన్ని ప్రచురణకు సిద్ధంచేయటానికి ఎంతో శ్రమను ఎంగెల్స్ హెచించ్చాల్సి వచ్చింది. పలుచోట్ల అవసరమైన మేరకు కొన్ని మార్పులు చేర్పులు చేయాల్సివచ్చింది. "ఈ రాతప్రతి సంపాదకత్వం నాకు గొప్ప శాస్త్రీయ సంతుష్టిని కలిగించింది" అని రాశాడాయన. "మార్క్సు వంటి మహామేధావి రాతప్రతులకు సంపాదకత్వ బాధ్యత వహించి నప్పుడు, ఎవరైనా ఎంతో కష్టపడి పనిచేయాల్సి వుంటుంది. అందులోని ప్రతి అక్షరం లక్షలు చేస్తుంది. అయితే, ఇంత శ్రమపడుతున్నా, నాకెంతో సంతోషంగా వుంది. ఈ పని చేస్తున్నంతసేపూ నా మిత్రుని సాంగత్యం మరల లభించినట్లనిపిస్తోంది". (ఎంగెల్స్, అదే పుస్తకం పేజి:150)

ఈ మూడవ భాగాన్ని ప్రచురణకు సిద్ధం చేయడానికి దాదాపు పదేళ్ళు పట్టింది. ఇక పెట్టుబడి నాల్గవ భాగాన్ని ఎంగెల్స్ అవిశ్రాంత పనులు కారణంగా, దానిని శుద్ధ ప్రతిని తయారు చెయ్యలేక, ఆ బాధ్యతను కారల్ కౌటస్కీకి అప్పగించారు. కాని అది సమగ్రంగా రాలేదు. చివరకు 1924 సోవియట్ కమ్యూనిస్టు పార్టీ సమగ్రంగానే ప్రచురించి వెలువరించింది. 1882కు ముందు తర్వాత మరికొన్ని గ్రంథాలను రాసిన ఎంగెల్స్ వాటిని వెలువరించారు. అవి: జర్మనీ రైతాంగ యుద్ధం (1874), యాంటిడూరింగ్(1877)

లుడ్విగ్ ఫూయక్‌బా(1888), కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగ వ్యవస్థ పుట్టుక(1884), ప్రకృతి గతితర్కం ఇది, 1895 వరకు ముద్రణ జరగలేదు. 1927లో సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రచురించింది. ఎన్నో వ్యాసాలు, పలు మార్క్సిస్టు గ్రంథాలకు పీఠికలూ పలు సమీక్షలు రాశాడు. మార్క్సు, ఎంగెల్స్ కలిసి రాసిన గ్రంథాలూ వున్నాయి.

శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంత నిర్మాతలైన మార్క్సు, ఎంగెల్స్ మార్క్సిస్టు మూల గ్రంథాలను ఉమ్మడిగాను, విడివిడిగాను రచించి, ప్రపంచానికి అందించారు. మార్క్సు 1883లో మరణించగా, ఎంగెల్స్ 1895లో అస్తమించారు.

వారిద్దరూ రెండు సంవత్సరాల తేడాతో ద్విశత జయంతి ఉత్సవాలను దేశదేశాల కమ్యూనిస్టులు, కార్మికవర్గ సంఘాల నాయకులు, సోషలిస్టులు, గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంవత్సరం నవంబరు 28తో అవి, ముగింపుకు వచ్చాయి.

మార్క్సుతో కలసి కమ్యూనిస్టు పార్టీలలో ఆంతరంగికంగా తలెత్తిన మితవాద, అతివాద అవకాశవాద శక్తులకు వ్యతిరేకంగా ఎండగట్టడంలోనూ, సోషలిస్టు ఆశయాలు, కమ్యూనిస్టు లక్ష్యాల సాధనలో నిర్విరామంగా కృషిచేశారు. మార్క్సు మరణానంతరం కూడా అదేవిధంగా ఎంగెల్స్ అదే స్థాయిలో చేసిన కృషి విప్లవ కమ్యూనిస్టులకు ఆచరణీయం.

ఎంగెల్స్ 1820 నవంబరు 28న జర్మనీలో జన్మించారు. 1895 ఆగస్టు 5న లండన్‌లో మరణించారు. ఎంగెల్స్ సంపన్న కుటుంబంలో జన్మించి, యుక్తవయసులోనే వారి తండ్రి మాంచెస్టరులో స్వంత బట్టలమిల్లు నిర్వహణకోసం పంపించారు. 1842లో మార్క్సుతో పరిచయం ఏర్పడి, అది క్రమంగా అభివృద్ధిచెంది, పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థలో మౌలికమార్పులు తీసుకురావడమే తమ కర్తవ్యంగా భావించి, ఆ వ్యవస్థలో సంపూర్ణ పరివర్తన తీసుకురాదగిన విప్లవ కార్మికులను సంఘటితపరచడంకోసం ట్రేడ్ యూనియన్ల ద్వారా విప్లవ కార్మిక పార్టీలను ఆర్గనైజ్ చేయడం, నాల్గు దశాబ్దాలపాటు అవిశ్రాంత కృషిచేయడం, ఆర్థిక, రాజకీయ, తాత్విక, చారిత్రక భౌతికవాదం ద్వారా కమ్యూనిస్టులకు ప్రాపంచిక దృక్పథాన్ని అందించి; ప్రపంచ కార్మిక శ్రామిక మరియు రైతాంగానికి తమ మార్గదర్శకం ద్వారా నిర్దేశించారు. ఆ విప్లవ వెలుగుబాటలో పయనించడమే అందరి కర్తవ్యంగా భావించి, స్వీకరిద్దాం!